క్లుప్తంగా

మెట్టును కలిసిన నాయకులు



సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డిని కలిసిన వైఎస్సార్‌సీపీ నాయకులు

బొమ్మనహాళ్: రాయదుర్గం వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డిని ఆదివారం బెంగళూరులోని ఆయన స్వగృహంలో మండల వైఎస్సార్‌సీపీ నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఆస్పత్రిలో చికిత్స పొంది విశ్రాంతి తీసుకుంటున్న మెట్టును నాయకులు కలిసి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి మెట్టు విశ్వనాథ్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రామాంజినేయులు, జెడ్పీటీసీ సభ్యులు ఎల్.లోకేష్, సర్పంచ్ కృష్ణ, నియోజకవర్గ సోషల్ మీడియా కన్వీనర్ రవీంద్రనాథ్‌రెడ్డి, నాయకులు సుంకేష, ప్రభాకర్‌గౌడ్, శివయ్య, వంశీ, రాజప్ప తదితరులు పాల్గొన్నారు.

ఆశాజనకంగా కంది పంట



కమ్మూరు వద్ద కందిలో విరబూసిన పూత

కూడేరు: ఇటీవల అడపాదడపా వర్షాలు కురవడంతో కంది పంట ఏపుగా పెరిగి ఆశాజనకంగా ఉంది. మండల వ్యాప్తంగా సుమారు 5 వేల ఎకరాల్లో రైతులు పంట సాగు చేశారు. ప్రస్తుతం పంట పూత దశకు వచ్చింది. పూత ఎంత పూస్తే అంత దిగుబడి వస్తుంది. పూత దశలో వాతావరణంలో మార్పులు చోటు చేసుకోకుండా సాధారణంగా ఉండి, తెగుళ్లు ఆశించకపోతే రైతుకు కంది పంట పండినట్టే. వర్షాభావంతో వేరుశనగ పంటను ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేయలేకపోయారు. దీంతో ఈ ఏడాది రైతులంతా కంది పంటపై ఆశలు పెట్టుకున్నారు.

ఉత్తమ ఉపాధ్యాయుడికి సన్మానం



సిద్ధేశ్వరప్పను సన్మానిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కుందుర్పి: ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికైన తూముకుంట గ్రామానికి చెందిన సిద్ధేశ్వరప్పను ఆదివారం మండల వైఎస్సార్‌సీపీ నాయకులు ఘనంగా సన్మానించారు. మండల మాజీ కన్వీనర్ సత్యనారాయణశాస్త్రి, జిల్లా ఐటీ విభాగం అధ్యక్షుడు నరేష్, సర్పంచులు రామూర్తి, అతావుల్లా, వార్డు సభ్యుడు మంజు, నాయకులు కదరంపల్లి అంజి, పెద్దోబులేసు, లక్ష్మణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

‘పండ్ల మొక్కల బిల్లులు అందజేయండి’

కుందుర్పి: ఉపాధి హామీ పథకం పర్యవేక్షణలో డ్రైల్యాండ్ హార్టికల్చర్ పథకం కింద పండ్లతోటలు సాగుచేసిన రైతులకు నాలుగు నెలలుగా బిల్లు అందలేదని మెట్ట భూముల్లో సాగుచేసిన చిన్నసన్నకారు రైతులు వాపోతున్నారు. మండల వ్యాప్తంగా 980 ఎకరాల్లో 520 మంది రైతులు రెండేళ్లుగా ఈపథకం ద్వారా వివిధ రకాల పండ్ల మొక్కలను సాగుచేశారు. కాగా ఏడాది 10 నెలలు కాలంగా మెటీరియల్ బిల్లులు, నాలుగు నెలలుగా వాచ్‌అండ్ వార్డ్ బిల్లులు అందలేదని రైతులు హనుమన్న, రూపా, నాగేంద్ర, తిమ్మరాజు తదితరులు ఆవేదన వ్యక్తం చేశారు. కొంతమంది రైతులు బిల్లులు అందకపోయినా రికార్డుల్లో మాత్రం ఇప్పటికే మీ బిల్లులు పూర్తయినట్లు కంప్యూటర్లలో నమోదైనట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీసం మొక్కలకు ట్రాక్టర్ల ద్వారా సరఫరా చేసిన నీటి బిల్లులైనా మంజూరు చేయాలని రైతులు కోరుతున్నారు.

పోలీసుల అదుపులో అనుమానిత వ్యక్తి

రాయదుర్గం: గుమ్మఘట్ట మండలం రంగచేడు సమీపాన బుడిమేపల్లికి వెళ్లే దారిలో ఆదివారం రాత్రి అనుమానిత వ్యక్తి హల్‌చల్ చేశాడు. రంగచేడు– కలుగోడు ప్రధాన రహదారిలో బుడిమేపల్లి దారి వద్ద అనుమానంగా నిలబడ్డ వ్యక్తిని రైతు ఎర్రిస్వామి పలకరించాడు. ఎవరని ప్రశ్నించగా రాయి చూపించాడు. మరో ఇద్దరు ద్విచక్ర వాహనంపై వచ్చి అడిగారు. వారిపై ఏకంగా రాయి విసిరాడు. విషయం గ్రామస్తులు చెప్పడంతో సుమారు వంద మందికి పైగా అక్కడికెళ్లి చుట్టుముట్టారు. ఎవరని ప్రశ్నిస్తే తనది బీహార్ అంటూ హిందీలో చెప్పాడు. అతని వద్ద మచ్చుకత్తి, సిరంజి, పౌడర్‌ను స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు అతన్ని అదుపులోకి తీసుకున్నారు. విచారణ తర్వాత పూర్తి విషయాలు వెల్లడిస్తామని ఎస్‌ఐ ఈశ్వరయ్య తెలిపారు.

తెలుగు తమ్ముళ్ల ‘బెల్టు’ లొల్లి..!

- నియోజకవర్గంలో 300కు పైగా బెల్టుషాపులు
- బెల్టుషాపుల కోసం మరణాయుధాలతో దాడులకు తెగబడుతున్న వైనం
- పట్టించుకోని ఎక్సైజ్ పోలీసులు



కుందుర్పి మండలం ఏళ్లచింతలో బెల్టుషాపు విషయమై పరస్పరం దాడులకు దిగిన రెండు వర్గాలు (ఫైల్)



బెల్టుషాపులకు వాహనంలో మద్యం తరలిస్తున్న దృశ్యం

కళ్యాణదుర్గం: కళ్యాణదుర్గం నియోజకవర్గంలో తెలుగు తమ్ముళ్ల ‘బెల్టు షాపుల’ లొల్లి కొనసాగుతోంది. ఒక గ్రామంలో మూడు నుంచి నాలుగైదు బెల్టు షాపులు నిర్వహిస్తున్నారంటే నియోజకవర్గంలో మద్యం ఏ మేర ఏరులై పారుతుందో తెలుస్తోంది. తాజాగా మద్యం బెల్టు షాపుల నిర్వహణలో తెలుగు తమ్ముళ్ల మధ్య పలుచోట్ల వివాదాలు తలెత్తుతున్నాయి. ఇటీవల కుందుర్పి మండలంలో తెలుగు తమ్ముళ్లు బెల్టుషాపుల నిర్వహణ కోసం ఏకంగా మరణాయుధాలతో దాడులకు తెగబడుతున్నారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థమవుతోంది.

నియోజకవర్గంలో 300కు పైగా బెల్టుషాపులు

నియోజకవర్గంలో తాగునీటికి కొదవ ఉంటుందేమో కానీ మద్యానికి కొదవ ఉండడం లేదు. కళ్యాణదుర్గం మున్సిపాలిటీ మొదలుకుని కళ్యాణదుర్గం రూరల్ మండలం, కంబదూరు, కుందుర్పి, శెట్టూరు, బ్రహ్మసముద్రం మండలాల్లో బెల్టుషాపులు వందల సంఖ్యలో ఉన్నాయి. వీటన్నింటినీ టీడీపీకి చెందిన తెలుగు తమ్ముళ్లే నిర్వహిస్తున్నారు. గుడి లేదు...బడి లేదు ఎక్కడ పడితే అక్కడ బెల్టుషాపులు నిర్వహిస్తూ అక్రమార్జనే ధ్యేయంగా మద్యం అమ్మకాలు చేపట్టారు.

బాటిల్ పై రూ.30 వరకూ అ‘ధనం’

నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో మద్యం ఏరులై పారుతోంది. గ్రామాల్లో బెల్టుషాపు పెట్టుకునేందుకు పంచాయతీల్లో ఒక్కో చోట ఒక్కో ధర నిర్ణయించి బెల్టుషాపు పెట్టుకునేందుకు రూ.20 వేలు నుంచి రూ.6.70 లక్షల వరకూ ముడుపులు నేతలకు ముట్టజెప్పినట్లు సమాచారం. దీంతో మద్యం దుకాణాల నుంచి నేరుగా ప్రత్యేక వాహనాల్లో మద్యం పల్లెకు చేరుతోంది. బెల్టుషాపు నిర్వాహకుల వద్దకే మద్యం డోర్ డెలివరీ చేస్తున్నారు. గ్రామాల్లో ఒక్కో బాటిల్ పై రూ.10 నుంచి రూ.30 వరకు అదనంగా వసూళ్లు చేస్తూ మందుబాబుల జేబులకు చిల్లు వేస్తున్నారు.

బెల్టుషాపుల కోసం మరణాయుధాలతో దాడులు

గ్రామాల్లో బెల్టుషాపుల నిర్వహణలో ఆధిపత్యం కోసం నిర్వాహకులు దాడులకు దిగుతున్నారు. తాజాగా కుందుర్పి మండలం ఏళ్లచింత గ్రామంలో బెల్టుషాపు నిర్వహణపై టీడీపీ నేతలు వడ్డే తిమ్మప్ప, వీరారెడ్డి ఇనుపరాడ్లు, కట్టెలతో ఒకరిపై ఒకరు దాడికి తెగబడ్డారు. గ్రామాల్లో ఎన్నడూ లేని విధంగా బెల్టుషాపుల కోసం దాడులకు దిగడం ఇదే మొదటిసారి. ప్రశాంతంగా ఉన్న గ్రామాల్లో బెల్టుషాపులు పెట్టి కక్షలకు ఆజ్యం పోస్తున్నారని పలువురు గ్రామస్తులు మండిపడుతున్నారు. ఈ ఘటనలో ఏకంగా 16 మందిపై అప్పట్లో కేసు నమోదు చేయడం గమనార్హం.


చూసీ చూడనట్లుగా వ్యవహరిస్తున్న ఎక్సైజ్ పోలీసులు

నియోజకవర్గంలో విచ్చలవిడిగా బెల్టుషాపులు నిర్వహిస్తున్నా ఎక్సైజ్ పోలీసులు మాత్రం చూసీ చూడనట్లుగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. బెల్టుషాపులు నిర్వహిస్తున్న వారంతా కేవలం టీడీపీకి చెందిన వారే కావడంతో చేసేదేమీ లేక మిన్నకుండిపోతున్నారు. దాడులు చేయడానికి వెళ్లాలన్నా ముందుకు కదలని పరిస్థితి. ఎక్సైజ్ దాడులు లేకపోవడంతో గ్రామాల్లో బెల్టుషాపుల నిర్వాహకులు ఇష్టమొచ్చినట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు లేకపోలేదు.

నియోజకవర్గంలో ఇలా..

మండలం	బెల్టుషాపుల సంఖ్య
కళ్యాణదుర్గం	130
కంబదూరు	47
కుందుర్పి	38
శెట్టూరు	30
బ్రహ్మసముద్రం	60

ప్రజల జీవితాలను చిత్తు చేస్తున్నారు



నియోజకవర్గంలో తాగునీటికి కొదవ ఉంటుందేమోకానీ మద్యానికి కొదవ లేకుండాపోయింది. కూటమి అధికారంలోకి వచ్చాక నియోజకవర్గంలో ఏకంగా 300కు పైగా బెల్టుషాపులు తెరిచారంటే పేదలతో మద్యం ఎలా తాగిస్తున్నారో చెప్పొచ్చు. మద్యం మత్తులో యువత జీవితాలను చిత్తు చేసుకుంటున్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపి నియోజకవర్గంలోనే ఎంతో మంది యువకులు మృతి చెందారు. అయినా కూటమి నేతలకు ఇవేవీ పట్టవు. బెల్ట్ షాపుల కట్టడిపై ప్రభుత్వం చొరవ చూపాలి.

– తలారి రంగయ్య, వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త, కళ్యాణదుర్గం

గ్రామ కమిటీలతో పార్టీ బలోపేతం

శెట్టూరు: వైఎస్సార్‌సీపీ గ్రామ కమిటీలతో పార్టీ మరింత బలోపేతం జరుగుతుందని మండల కన్వీనర్ ఎమ్మెఎస్ రాయుడు, ఎంపీపీ సోమనాథ రెడ్డి అన్నారు. ఆదివారం శెట్టూరులో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు సమావేశమై పార్టీ అనుబంధ గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ పార్టీ క్యాడర్ మొత్తం సమన్వయంతో పనిచేసుకోవాలని, పార్టీ కార్యక్రమాలలో చురుగ్గా పాల్గొనాలని నిర్ణయించారు. కూటమి తప్పుడు హామీలను, మోసాలను ఎండగట్టాలన్నారు. ప్రతి కార్యకర్తను పార్టీ గుర్తిస్తుందని, అందరం సమిష్టిగా పనిచేద్దామన్నారు. కార్యక్రమంలో జిల్లా, తాలుకా, మండల పార్టీ, పార్టీ అనుబంధ సంఘాల నాయకులు శెట్టూరు తిప్పేస్వామి, హరినాథరెడ్డి శ్యామ్, మహాబలి, మిద్దె సుధాకర్, టైలర్ వన్నూరుస్వామి, చటాకుల రామాజినేయులు, జీవన్‌గోపాల్ రెడ్డి, వీరాజినేయులు, వీరభద్రప్ప, లింగప్ప, నాగేంద్ర, ఆశీమ్, మూలింటి బాలకృష్ణ, నాగేంద్ర రెడ్డి, నరసింహ, మహమ్మద్, రంగనాథ్ శెట్టి, దురుగన్న, వడ్డే వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



గ్రామ కమిటీ ఎన్నికకు హాజరైన నాయకులు.

బాలికలు ఉన్నతంగా చదవాలి



వార్డెన్‌కు పుస్తకాన్ని అందజేస్తున్న జేవీవీ జిల్లా అధ్యక్షుడు చిత్తప్ప

కళ్యాణదుర్గం: బాలికలు ఉన్నతంగా చదవాలని జేవీవీ జిల్లా అధ్యక్షుడు చిత్తప్ప సూచించారు. అంతర్జాతీయ బాలిక దినోత్సవంలో భాగంగా శనివారం రాత్రి జేవీవీ జిల్లా అధ్యక్షుడి ఆధ్వర్యంలో ప్రభుత్వ బాలికల వసతిగృహంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథులుగా హాజరైన జేవీవీ జిల్లా అధ్యక్షుడితో పాటు నియోజకవర్గ కన్వీనర్ లయన్ కంబాల తిమ్మారెడ్డి, శెట్టూరు ఎంఈఓ శ్రీధర్, కుందుర్పి ఎంఈఓ ఓబుళపతి మాట్లాడుతూ బాలికలు మంచి లక్ష్యంతో ముందుకు వెళ్లాలన్నారు. అనంతరం ‘ఎదిగే ఆడపిల్ల...ఏం తెలుసుకోవాలి..’ అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో జేవీవీ నాయకులు సోమశేఖర్, మహంతేష, ఓబుళమ్మ, జయలక్ష్మి పాల్గొన్నారు.

17న హోన్నూరుస్వామి దర్గా ప్రారంభం



హోన్నూరుస్వామి దర్గా

వజ్రకరూరు: చాబాల గ్రామంలో నూతనంగా నిర్మించిన దర్గా హోన్నూరుస్వామి దర్గాను ఈనెల 17న ప్రారంభించనున్నట్లు దర్గా కమిటీ సభ్యులు ఆదివారం తెలిపారు. 17వ తేదీ తెల్లవారు జామున స్వామి దర్గా ప్రవేశం ఉంటుందన్నారు. తర్వాత 6:30 గంటల నుంచి భక్తులకు దర్శనం కల్పిస్తామని తెలిపారు. తర్వాత భక్తులకు అన్నదానం ఉంటుందని వివరించారు.

నేడు యర్రగుంటలో ‘రచ్చబండ’

కణేకల్లు: మండలంలోని యర్రగుంట గ్రామంలో సోమవారం మధ్యాహ్నం ‘రచ్చబండ’ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి, మాజీ ఎంపీపీ అలేరి రాజగోపాల్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పాటిల్ బ్రహ్మానందరెడ్డి తెలిపారు. మెడికల్ కాలేజీలను కూటమి సర్కారు ప్రైవేటీకరణ చేయడాన్ని నిరసిస్తూ రచ్చబండ కార్యక్రమం నిర్వహించి ప్రజల నుంచి సంతకాల సేకరణ చేపట్టనున్నట్లు పేర్కొన్నారు.

తాగునీటి పథకం పనులకు నిధుల మంజూరు

కణేకల్లు: మండలంలోని సొల్లాపురంలో తాగునీటి పథకం పనుల నిర్వహణకు రూ.25 లక్షలు మంజూరైనట్లు ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ శివకృష్ణారెడ్డి తెలిపారు. ఈ నిధులతో పైప్‌లైన్, బోరు, పంప్‌సెట్ పనులు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఎన్.హనుమాపురానికి రూ.15 లక్షలు మంజూరైనట్లు చెప్పారు. ఈ నిధులతో పైప్‌లైన్ పనులు చేయనున్నట్లు ఆయన తెలిపారు.

ఐదుకల్లు సదాశివన్ సేవలు చిరస్మరణీయం

కళ్యాణదుర్గం: స్వాతంత్య్ర ఉద్యమ నాయకుడు హరిజన ఉద్యమ నిర్మాత, భూ పోరాట యోధుడు ఐదుకల్లు సదాశివన్ సేవలు చిరస్మరణీయమని సీపీఐ నాయకులు అన్నారు. ఐదుకల్లు సదాశివన్ 37వ జయంతిని పురస్కరించుకుని ఆదివారం సీపీఐ కార్యాలయంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి గోపాల్, సహాయ కార్యదర్శి నరసింహులు మాట్లాడారు. హరిజన హాస్టల్‌ను స్థాపించి బహుజనులకు విద్యను అందించిన ఘనత సదాశివన్ గారిదేనన్నారు. జిల్లాలో మొదటిసారి కమ్యూనిస్టు సభ్యత్వం స్వీకరించిన వ్యక్తి కామ్రేడ్ సదాశివన్ అని కొనియాడారు. కార్యక్రమంలో పట్టణ సహాయ కార్యదర్శి బుడేన్, తిమ్మప్ప, మారుతి, ఏఐఎస్ఎఫ్ నియోజకవర్గ కోశాధికారి పవన్, గోపి, మోహన్, జగదీష్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.



సదాశివన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

కనపడితే కరిచేయడమే..!



ఉరవకొండ క్లాక్‌టవర్ ప్రధాన రహదారిపై గుంపులుగా ఉన్న కుక్కలు

- ఉరవకొండలో అధికమైన కుక్కల దాడి
- ఆందోళనలో పట్టణవాసులు

ఉరవకొండ: ఉరవకొండ మేజర్ పంచాయతీ పరిధిలో వీధి కుక్కల దాడులు అధికమయ్యాయి. కనబడిన వారినల్లా కరిచేందుకు వస్తుండటంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. సాధారణంగా వీధుల్లో ఎక్కడగా కనబడే కుక్కలు క్లాక్‌టవర్ వద్ద నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు గుంపులు గుంపులుగా చేరి ఇటు వాహనదారులు, పాదచారులకు ముచ్చెమటలు పట్టిస్తున్నాయి. క్లాక్ టవర్ వద్ద వాహనదారుల అంచుకు గట్టిగా అరుస్తూ వెంట బడుతున్నాయి. రాత్రివేళ ఒకరిద్దరూ నడుచుకుంటూ వెళ్తుంటే వెంబడిస్తున్నాయి. ఈ ఏడాది జూన్ నుంచి ఇప్పటి వరకూ 1060 మంది కుక్క కాటుకు గురయ్యారు. వారిలో పురుషులు 472 మంది, మహిళలు 201, బాలురు 236, బాలికలు 83 మంది ఉన్నారు.



కవితా హోటల్ సర్కిల్ వద్ద వాహనదారులను భయాందోళనకు గురిచేస్తున్న కుక్కల గుంపు

నియంత్రణ చర్యలు శూన్యం

కుక్కల సంచారాన్ని నియంత్రించే దిశగా మేజర్ పంచాయతీ అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టడం లేదు. కనీసం వాటి సంతానాన్ని తగ్గించే చర్యలు శూన్యం. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు కుక్కల నియంత్రణ చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

శుభకార్యం



వధూవరులను ఆశీర్వదించిన మాజీ ఎంపీ తలారి రంగయ్య

కళ్యాణదుర్గం: పట్టణంలోని సుబ్రమణ్యేశ్వర స్వామి కల్యాణ మండపంలో దాసరి భవ్యశ్రీ, అఖిల్ కుమార్‌ల వివాహం ఆదివారం జరిగింది. వివాహానికి మాజీ ఎంపీ, పార్టీ సమన్వయకర్త డాక్టర్ తలారి రంగయ్య, ఎమ్మెల్సీ మంగమ్మ హాజరై వధూవరులను ఆశీర్వదించారు. పార్టీ మండల కన్వీనర్ గోళ్ల సూరి, నాయకులు ఉమాపతి, బిక్కిహరి, వన్నూరుస్వామి, షేక్షావలి, సురేష్, టైలర్ శీను పాల్గొన్నారు.

బెళుగుప్పలో...



సాయినాథ్, లోహితల వివాహంలో పాల్గొన్న ప్రణయ్‌రెడ్డి

బెళుగుప్ప: మండల కేంద్రంలోని ఎర్రితాతస్వామి ఆలయ ప్రాంగణంలో ఆదివారం బెళుగుప్ప గ్రామ వైఎస్సార్‌సీపీ కన్వీనర్ పూల ప్రసాద్ మేనల్లుడు సాయినాథ్, లోహిత వివాహం జరిగింది. వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జోనల్ ప్రెసిడెంట్ ప్రణయ్‌రెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర నాయకులు త్రిలోక్ రెడ్డి, జాయింట్ సెక్రటరీ శ్రీనివాస్, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు శివలింగప్ప, మండల కన్వీనర్ మచ్చన్న, జిల్లా కమిటీ నాయకులు భాస్కర్‌రెడ్డి, రామేశ్వరరెడ్డి, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

విత్తన వేరుశనగ పంపిణీ చేయండి

కుందుర్పి: రబీ సీజన్ ప్రారంభమైన తరుణంలో రైతులకు ప్రభుత్వం సబ్సిడీ విత్తన వేరుశనగ అందజేయాలని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ హనుమంతరాయుడు,ఉపాధ్యక్షుడు భీమప్ప, వాల్మీకి కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ పాలాక్షి, రైతు విభాగం అధ్యక్షుడు మంజునాథ్, యూత్ విభాగం నాయకుడు అన్వేష్ తదితరులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం వారు విలేకరులతో మాట్లాడుతూ ఈ ఏడాది రాష్ట్ర ప్రభుత్వం ఖరీఫ్‌లో సైతం సబ్సిడీ విత్తనం అరకొరగానే అందజేశారన్నారు. ఒక్క వైపు వర్షాభావం మరో వైపు చీడపీడలతో 80 శాతం ఖరీఫ్ వేరుశనగ పంటను రైతులు కోల్పోయారన్నారు. రబీలోనైనా వేరుశనగ పంట తమను గట్టెక్కిస్తోందన్న ఆశతో ఇప్పటికే బోరుబావుల కింద రైతులు పొలాలను దుక్కి దున్ని వేరుశనగసాగుకు సమాయత్తమయ్యారన్నారు. సత్వరం రైతులకు వేరుశనగ విత్తనం అందజేయాలని వారు కోరారు.

సంతల ఆదాయం రూ.3.37 లక్షలు

అనంతపురం అగ్రికల్చర్: స్థానిక వ్యవసాయ మార్కెట్‌యార్డులో ఈ వారం జరిగిన పశువులు, జీవాల సంతల ద్వారా రూ.3.37 లక్షలకు పైగా ఆదాయం వచ్చినట్లు ఏడీఎం రాఘవేంద్రకుమార్ తెలిపారు. అందులో శనివారం జరిగిన గొర్రెలు, పొట్టేళ్ల సంత ద్వారా రూ.2,11,090 వసూలు కాగా ఆదివారం జరిగిన పశువులు, ఎద్దుల సంత నుంచి రూ.1,26 లక్షలు మేర వసూలైనట్లు తెలిపారు.

ఈసారైనా సమావేశానికి వస్తారా?



బొమ్మనహాళ్ మండల పరిషత్ కార్యాలయం

- మండల సర్వసభ్య సమావేశానికి తరచూ అధికారుల డుమ్మా
- నేడు బొమ్మనహాళ్ మండల మీట్

బొమ్మనహాళ్: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మండల సర్వసభ్య సమావేశాలు మొక్కుబడిగా సాగుతున్నాయి. మండలస్థాయిలో ఉన్న సమస్యలు, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై చర్చించి నిర్ణయాలు తీసుకునేందుకు ప్రతి నెలకు లేదా మూడు నెలలకు ఒకసారి మండల సమావేశాలు నిర్వహిస్తుంటారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ 16 నెలల కాలంలో ఐదుకు పైగా మండల సమావేశాలు జరిగాయి. అయితే ఈ సమావేశాలకు అధికారులు నామమాత్రంగానే హాజరవుతున్నారు. దీంతో సభ్యులు అడిగే ప్రశ్నలకు సమాధానం చెప్పేవాళ్లు కరువయ్యారు. కనీసం కూటమి సర్కార్‌లో ఏ పథకాలు అమలు, వైఫల్యాలపై చర్చించే పరిస్థితి కూడా లేదు. ఎంపీటీసీలు, సర్పంచ్‌ల పదవీకాలం ముగియనుంది. కనీసం సోమవారం జరిగే మండల సర్వసభ్య సమావేశానికైనా అధికారులు హాజరవుతారా అనేది చూడాలి.

వేధిస్తున్న సమస్యలు

గ్రామాల్లో అనేక చోట్ల పారిశుద్ధ్యం సమస్య తీవ్రంగా ఉంది. పలు గ్రామాల్లో వైరల్ జ్వరాలు ప్రబలి ప్రజలు పక్క రాష్ట్రమైన కర్ణాటకలోని బళ్లారికి పరుగు పెడుతున్నారు. వ్యవసాయ సీజన్ కావడంతో యూరియా కోసం రైతులు అవస్థలు పడుతున్నారు. గ్రామీణ రోడ్లు దారుణంగా మారడంతో ప్రయాణానికి ఇక్కట్లు పడుతున్నారు. ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన ఉచిత బస్సు బొమ్మనహాళ్ మండలానికి ఉపయోగం లేకుండా పోయింది. ఇక్కడ తిరిగే అన్ని ప్రభుత్వ బస్సులు అంతరాష్ట్ర సర్వీసులు కావడంతో ఏ బస్సు ఎక్కినా డబ్బులు ఇచ్చి మహిళలు టికెట్ తీసుకోవాల్సిన దుస్థితి నెలకొంది. ఇలా అనేక సమస్యలపై మాట్లాడేందుకు , ప్రశ్నించేందుకు ప్రాదేశిక సభ్యులు సిద్ధంగా ఉన్నా మండల స్థాయి అధికారులు మాత్రం సమావేశాలకు రాకపోవడంతో సమావేశాలు నామమాత్రంగా మారుతున్నాయి.

అ‘పూర్వ’ సమ్మేళనం



నాటి అధ్యాపకులతో పూర్వ విద్యార్థులు

రాయదుర్గం: మండల పరిధిలోని 74 ఉడేగోళం సమీపంలోని కేటీఎస్ డిగ్రీ కళాశాలలో పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 2003–2006 విద్యాసంవత్సరంలో కలసి చదివిన విద్యార్థులు తమ కుటుంబ సభ్యులతో కలసి హాజరయ్యారు. నాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. కాలేజీ రోజుల్లో చేసిన అల్లరి, మంచి కార్యక్రమాలను నెమరవేసుకున్నారు. తాజాగా వివిధ వృత్తులు, ఉద్యోగాలు, వ్యాపారాల్లో స్థిరపడిన వారంతా ఒకరికొకరు పరిచయాలు చేసుకుని సంతోషంగా గడిపారు. అప్పట్లో చదువు చెప్పిన అధ్యాపకులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ బాబు, అధ్యాపకులు భీమరెడ్డి, కోటేశ్వరరావు, మేరీ మాధురి, పూర్వ విద్యార్థుల్లో గుమ్మఘట్ట డిప్యూటి తహసీల్దార్ రఘు, పోలీస్ సిబ్బంది హజరత్, పరమేష్, బంగి రవీ, ఉపాధ్యాయుడు ఇక్బాల్ తదితరులు పాల్గొన్నారు.

నకిలీ మద్యంపై నేడు పోరుబాట

రాయదుర్గం: వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు నకిలీ మద్యంపై పోరుబాట కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మెట్టు గోవిందరెడ్డి తెలిపారు. సోమవారం ఉదయం 11 గంటలకు స్థానిక ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ వద్ద నిరసన కార్యక్రమం చేపట్టినట్లు పేర్కొన్నారు. నకిలీ మద్యం అరికట్టాలని ఎక్సైజ్ అధికారులకు వినతిపత్రం అందచేస్తామన్నారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి మెట్టు విశ్వనాథ్‌రెడ్డి, నియోజకవర్గ పరిశీలకుడు ఎల్ఎం మోహన్ రెడ్డి కార్యక్రమానికి హాజరవుతారన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ఘనంగా గౌరీదేవి పండుగ

గుమ్మఘట్ట: మండల వ్యాప్తంగా ఉన్న అన్ని గ్రామాల్లో గౌరీదేవి ఉత్సవాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాలలో గౌరీదేవి విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. బాలికలు కలశాలను ప్రదర్శించి గౌరీదేవి విగ్రహాలను ఊరేగించి సమీపంలో వున్న చెరువులు, వేదావతి హగరిలో గంగపూజ చేసి మొక్కులు తీర్చుకున్నారు.